# 20. తుప్ప పట్టిన, పాతబడిన...

దాదాపు ఇరవయి ఏళ్లు అయివుంటుంది.

నేను ఒంగోల్లో పనిచేసిన రోజులు-

ఒకనాడు సాయంకాలం నేనింటికి రాగానే మా ఆవిడ "అమ్మయ్య! వొచ్చేరా!" అంది; పెద్ద ఆందోళన తొలిగిన ధోరణిలో. "రాననుకున్నానేమో?" అని ఏదో సినీమా పాట అందుకున్నాను; మా ఆవిణ్ణి వేళాకోళం చేస్తూ. "జోకులు చాల్లెండి. ఆయనెవరో ఇప్పుడు ఐదున్నరకి వస్తాట్ట" అంది మా ఆవిడ. మధ్యాహ్నం నేను భోజనం చేసి వెళ్లాక వచ్చాడట. మళ్లీ ఇప్పుడు ఐదున్నరకి వస్తానన్నాడట. రేడియో లైసెన్సులు తణికీ చేసే ఇన్స్పెక్టరుట. "మన రేడియోకి లైసెన్స్ కడుతున్నామా అని అడిగేడు. కట్టడం లేదని చెప్పేస్తే ఏం చేస్తాడోనని మీరొచ్చేక రమ్మన్నాను."

ఇహనేం? మంచి కాలక్షేపం. ప్రఖ్యాత చిత్రకారుడు బాపుగారు అప్పటికే రేడియో లైసెన్సుల మీద, రేడియో ప్రోగ్రాములమీద మంచి మంచి కార్టూన్లు చాలా వేసేశారు. (మచ్చుకి కొన్ని:)

1. రేడియో మెకానిక్కు:- అయ్యా; మేం రేడియోలో మిషను ఏదైనా చెడిపోతే బాగుచేస్తాంగానీ ప్రోగ్రాములకి మా పూచీ లేదు.

2. భార్య: ఏమండీ; ఈ కొత్త రేడియో పట్టుకెళ్లి ఎలాగయినా షాపువాళ్లకి ఇచ్చెయ్యండీ, మునపటిదే నయం; ఇంచక్కా మంచి మంచి ప్రోగ్రాంలొచ్చేవి.

3. రేడియో లైసెన్స్‌ల ఇన్స్పెక్టరు:

అయ్యా, తమ రేడియో లైసెన్స్ సంగతి తమరు గమనించేరా? ఇది సరిగ్గా పదేళ్లనాటిది.-

ఇంటి యజమాని (లేదారేడియో వోనర్):- మరే; నిజమే! కాని తను ప్రోగ్రాంలు కూడా అప్పటివేనేమో దయచేసి ఆలోచించండి?

4. ఒకాయన రేడియో ఆన్‌చేసి; అందులోంచి వచ్చే శబ్దాల సంగతి పట్టించు కోకుండా పరధ్యానంగా ఏదో పుస్తకం చదువుకుంటూ ఉండగా; పక్కింట్లోంచి ఒకాయన ఒక గొడ్డలితో సహా దూకుడుగా ప్రవేశించి; రేడియోని నిలువునా రెండు ముక్కలుగా విరక్కొడతాడు. అప్పుడు ఇంటాయన"ప్రోగ్రాం నచ్చకపోతే ఆ మాట చెప్పొచ్చుగా; రేడియో కట్టేద్దునూ?" అంటాడు.

ఇలాంటివేవో కొన్ని ఆ వొచ్చే ఆయన మీద ప్రయోగించవచ్చుకదా అని సిద్ధం అవుతూ ఉండగానే ఆయన వచ్చాడు. 1959 అక్టోబర్ 20 వ తేదీన కొన్నాం మా రేడియో. కొన్నప్పుడు షాపువారు మా దగ్గిర లైసెన్స్ ఫీ కూడా వొసూలు చేసి మరీ ఇచ్చారు ఆ సెట్టు. అయితే, ఆ తరవాత నేను మరి ఆ రేడియోకి లైసెన్స్ అంటూ ఒక్క పైసాకూడా కట్టలేదు.

"1960 నుంచి 67 వరకు ఎనిమిదేళ్లకి నూట ఇరవై రూపాయలు. ముప్ఫయి రూపాయలజరిమానా. మొత్తం 150 కట్టండి; రసీదిస్తాను".

"నా రేడియో అంత విలువ చెయ్యదే?"

"చెయ్యక పోయినా సరే; అదే రూలు".

అంత డబ్బు నేను కట్టుకోలేననీ కావాలంటే ఆ రేడియో ఊరికనే ఇచ్చేస్తాను పట్టుకుపొమ్మనీ చెప్పిచూశాను. లాభంలేదన్నాడు. పోనీ పెరట్లో నూతిదగ్గర నాలుగడుగుల లోతుకి గొయ్యి తవ్వి పాతేద్దాం అన్నాను. పనికి రాదన్నాడు. దగ్గిరే రేల్వేలైనుంది; కాసేపట్లో ఏదో రైలు రావచ్చు; ట్రాక్ మీద పెట్టి తాడో వైరో వేసి గట్టిగా బిగించేస్తే క్షణాల్లో పిండి అయిపోతుందని సూచించాను. కుదరదన్నాడు. రేడియో స్టేషన్లనుంచి వొచ్చే ప్రోగ్రాంలు వింటున్నందుకు శిక్షగా పోనీ కొన్నాళ్లు జైల్లో కూచుంటానని ఆఫర్ చేసేను. ససేమిరా అన్నాడు. పాతాళభైరవి సినీమాలో రాజుగారి బావమరిదిలా పన్ను కట్టి తీరవలిసిందే నన్నాడు.

✣ ✣ ✣

మళ్లీ మొన్న డిసెంబర్ నెలలో హైద్రాబాద్ నుంచి వస్తూ; చెన్నకేశవ ఇంట్లో వృథాగా అటకమీద ఉన్న మూడు చక్రాల సైకిల్ని నాతోపాటు విశాఖపట్నం తెచ్చేను. చెన్న కేశవ ఆ సైకిల్ని పదేళ్లకిందట కొన్నాడు. వాళ్లబ్బాయిలిద్దరూ తొక్కేరు. ఇద్దరూ పెద్దవాళ్లయిపోయేరు. (అంటే మూడు చక్రాల సైకిలు తొక్కే వయసు దాటారు, అంతే.) మరి ఇప్పుడు మా మనవడికి రొండో యాడాది వెళ్లిందికదా. వాడికి ఇలాంటిది ఒకటుంటే బావుంటుందని నేను అనగానే - 'ఈ సైకిలు ఇప్పటికే తుప్పుపట్టిపోయింది; ఇంకా దీన్ని నాకు మనవడు పుట్టేదాకా దాచడం ఎందుకు; నువ్వు పట్టుకుపో' అని అతనన్నాడు. ఆవిధంగా -

విశాఖపట్నం స్టేషన్లో రైలు దిగగానే సూట్కేసు ఒక చేత్తోటి, ఆ మూడు చక్రాల సైకిలు ఒక చేత్తోటి పుచ్చుకుని ప్లాట్ఫారం కొంత నడిచి టిక్కెట్టు వప్పగించేసే దగ్గిర సూట్కేసు నేలకి దింపి జేబులో టిక్కెట్ బైటికి తీసి గేటు కాసిన ఆయనికి ఇవ్వబోయేటంతలో-

టిక్కెట్లు పుచ్చుకుంటున్నాయన కాక పక్కనున్న మరొకాయన నా ఎడం చేతిలో వున్న మూడు చక్రాల సైకిల్ని రెండువేళ్లతో పట్టుకుని "ఇది లగేజిలో బుక్ చేసేరా?" అన్నాడు.

"లేదు." అన్నాను.

"అలా అయితే ఆగండి, దీనికి ఛార్జి చెయ్యాలి." ఈ మాటు ఆ సైకిల్ని నాచేతిలోంచి లాగేసి కిందికి దింపేశాడు. ఒక్కవేలు మాత్రం ఉపయోగించి నన్ను పక్కకి రమ్మని సంజ్ఞచేసేడు. వెళ్లేను.

అతను నా టిక్కెట్ చూసి నేనెక్కణ్ణించొస్తున్నానో అరక్షణంలో గ్రహించేశాడు. జేబుల్లోంచి, ఒక నోటు బుక్కు, బాల్ పాయింట్ పెన్ను, ఒకానొక జంత్రీ (లెక్కలు కట్టుకునే పుస్తకం) తీసి; రెండు నిమిషాలపాటు ఏకాగ్రంగా పనిచేసి; "దీనికి డెబ్బయ్యె నిమిది రూపాయలు కట్టాలి." అన్నాడు.

నా టిక్కెట్టు మీద ముప్పయి కేజీలదాకా లగేజి తెచ్చుకోవచ్చు. నాసూట్కేసు గట్టిగా ఐదు కేజీలుండదు. ఈ సైకిలు మహా ఉంటే రెండు కేజీలు - అంచేత ఇది న్యాయం కాదన్నాను.

అనుమతించే లగేజికి దీనికీ సంబంధం లేదుట. ఇది కొండొకచో 'లగ్జూరియస్ ఆర్టికల్స్' అనగా విలాస వస్తువుల కోవలోకి వస్తుందిట. హైద్రాబాదు నుంచి విశాఖపట్నానికి; తుప్పుపట్టిన, పాతబడిపోయిన ఈ మూడు చక్రాల సైకిల్ తెచ్చినందుకు గోదావరి ఎక్స్ప్రెస్ అరుగుదల నిమిత్తం చెల్లించవలసినది పదహారు రూపాయలే అయినా; అక్కడి ప్లాట్ఫారం మీద అధికారుల కళ్లుగప్పి దీన్ని దొంగతనంగా రవాణా చేసినందుకు జరిమానా అరవై రెండు రూపాయలు; వెరసి మొత్తం

డెబ్బయ్యైనిమిదిట -

అతని వాదనలో ప్రతి అంశాన్ని తీవ్రంగా ఖండించడం మొదలు పెట్టాను. తుప్పు పట్టిన, పాతబడిన ఈ మూడు చక్రాల చిన్నపిల్లల సైకిలు ఎట్టి పరిస్థితుల్లోనూ "విలాస వస్తువు" కాజాలదు. డెబ్బయి నాలుగు కేజీల మనిషిని నేను గోదావరి ఎక్స్‌ప్రెస్‌లో వస్తే డెబ్బయ్యారు రూపాయలు తీసుకున్నారు కనుక రెండు కేజీల ఈ సైకిలుకి రెండు రూపాయలకన్నా తీసుకోకూడదు. అక్కడి అధికార్లు కూడా ఇక్కడివాళ్ల లాగే వొళ్లంతా కళ్లు చేసుకుని గమనించి ఈ వస్తువును బుక్ చేయించి వున్నట్టయితే జరిమానా అనేదే సంభవించదు- అది నా తప్పుకాదు; కనుక; జరిమానా ఇంకొకరెవరికో వెయ్యాలి గాని నాకు కాదు. నేను ఏవిధమైన జరిమానా చెల్లించేది లేదు.

"మరేం చేస్తారు?"

ఇక్కడ వదిలేసి వెళ్తానన్నాను. తనేమో పోలీసుల్ని పిల్చి నామీద నేరం మోపుతాట్ట. అసలది నాదికాదు, అని బుకాయిస్తే ఏం చేస్తావని రొకాయించాను. అసలతను పోలీసుని పిల్చేలోగా నేను ఆ తుప్పుపట్టిన, పాతబడిన మూడుచక్రాల సైకిల్ని గోదావరి ఎక్స్ ప్రెస్ కిందికి విసిరేసి వెళిపోతానన్నాను. ఇవేవీ ఆయనకి నచ్చకపోతే దీన్ని, ఆయనే, డ్యూటీ దిగి ఇంటికెడుతున్నప్పుడు కూడా పట్టుకుపోయి వాళ్ల మనవడికి ఇచ్చెయ్యొచ్చునని, ప్రస్తుతం ఆయనకెవరూ మనవళ్లు లేకపోతే ఒకడు పుట్టేదాకా ఆగినా నాకభ్యంతరం లేదని చెప్పేను.

ఈ లోపుగా అక్కడ ఒక గుంపు పోగయింది. నేను గట్టిగా నోరుచేసుకోడం చూసి- "ఏంటి సార్?" అని భోగట్టా చేసేవాడొకడు; "పోనీ ఎంతో కొంత పారెయ్య రాదా!" అని మరొకడు "అయినా ఈ డొక్కు సైకిలుకి లగేజేంటి?" అని ఇంకొకడు; "ఈళ్లమ్మా, రూల్సు!-" అని వేరే ఒకడు; ఒకడూ ఒకడూ జారుకుంటున్నారు; మళ్లా ఒకడూ మరొకడూ పోగుపడుతూనూ ఉన్నారు.

చిత్రమేమిటంటే; ఏ ఒక్కడూ కూడా ఆ రైల్వే అధికారితో గాని, నాతో గాని డైరెక్టుగా మాటాడ్డు. ఎవడిమట్టుకు వాడే, గొణుక్కోడం, జారుకోడం! ఆ గుంపులో హెచ్చుమంది; రైల్వే వారు పెట్టిన ( లేదా, చెప్పుకొస్తున్న) ఆ తుప్పుపట్టిన పాతబడిపోయిన రూల్‌లో ఏదో అవకతవకుందని నమ్మినవాళ్లే. అయినా ఒక్కడంటే ఒక్కడు నోరు మెదపడు. ఆహా, మన చైతన్యం!!

"ఓ కె, నాకు టైమవుతోంది, నేనెళ్తున్నాను" అని సర్రుమని గేటు దాటేశాను; టిక్కెట్ వప్పగించేసి.

"మిష్టర్!" అన్నాడు ఇందాకటి వుద్యోగి.

"నే నెళ్తున్నాను. నా అడ్రస్ ఈ టిక్కెట్ ని బట్టి హైద్రాబాద్ స్టేషన్‌కి రాస్తే కరెక్ట్‌గా చెప్తారు. నేనేం దొంగతనం చెయ్యలేదు. తుప్పుపట్టిన, పాతబడిపోయిన చిన్నపిల్లలాడుకునే మూడు చక్రాల సైకిల్ గోదావరి ఎక్స్‌ప్రెస్‌లో తెచ్చేనని మీరు నామీద కేసు పెట్టుకోండి. కోర్టులో కలుద్దాం." అన్నాను.

ఉన్నట్టుండి ఆ ఉద్యోగి "పైడితల్లీ!" అని ఒక పోర్టర్ని పిల్చి"ఈయన్ని పంపించీ" అని మూడు చక్రాల సైకిల్‌ని పైడితల్లికి అందించేడు.

పైడితల్లి నాతో కొంతదూరం నడిచివొచ్చి, "నగేజీనేదు, ఏట్నేదు గానీ; ఓ ఐదురూపాయి లొడీనేపోనావా?" అన్నాడు.

*

*( ' ఆంధ్రభూమి ' డెయిలీ : 3-2-88 )*

*With the best compliments from :*

**Sri Venkateswara**
**Rice & Oil Mills**

**CHEEPURUPALLI**
**Vizianagram dist.**